క్లుప్తంగా

గోకులం నిర్మాణ పనులు వేగవంతం



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ మోహన్‌మురళి

శ్రీరంగరాజపురం: మండల వ్యాప్తంగా మంజూరైన మినీ గోకులం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ మోహన్ మురళి ఆదేశించారు. సోమవారం మండలంలోని పెద్ద తయ్యూరులో గోకులం షెడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన పాడి రైతులకు మొదటి విడతగా 66 మినీ గోకులం షెడ్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఇప్పటికే 70 శాతం షెడ్ల పనులు ప్రారంభించామని, మిగిలినవి వెంటనే చేపట్టాలని సూచించారు. లేకుంటే మంజూరైన షెడ్లను రద్దు చేస్తామని హెచ్చరించారు. మినీ గోకులం నిర్మాణ పనులను ఫీల్డ్ అసిస్టెంట్‌లు నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి శ్రీవిద్య, సీనియర్ అసిస్టెంట్ బాలాజీ, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్, వెటర్నరీ అసిస్టెంట్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

లాభాల బాటలో 'స్త్రీ నిధి'



మాట్లాడుతున్న ఏపీఎం కల్పలత

పాలసముద్రం: మహిళలకు సత్వర రుణాలను అందిస్తూ లాభాల బాటలో నడుస్తున్న ఏకైక సహకార సంస్థ స్త్రీనిధి అని ఐకేపీ ఏపీఎం కల్పలత తెలిపారు. సోమవారం ఐకేపీ ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా సంఘాల లీడర్లు, సంఘమిత్ర, వీఓలు, సీసీలతో సమావేశం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ ప్రభుత్వం మరిన్ని ఎక్కువ రుణాలు అందించేలా స్త్రీనిధిని మెరుగుపరచాల్సిన బాధ్యత మహిళలపై ఉందన్నారు. బ్యాంకు లింకేజీల ద్వారా అందిస్తున్న వడ్డీలేని రుణాలను సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని సూచించారు. సమావేశంలో సీసీ చిరంజీవి, సంఘమిత్ర, శోభ, మంజుల, మురగయ్య, బాలయ్య, మంజుల పాల్గొన్నారు.

పంటకు బీమా తప్పనిసరి



హేమలత, ఏఓ

కార్వేటినగరం: రైతులు సాగు చేసే పంటలకు బీమా నమోదు తప్పనిసరని వ్యవసాయాధికారి ఆర్.హేమలత తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ వరి పంట ఎకరాకు రూ.630, వేరుశనగకు రూ.480 చెల్లించాలని, అలాగే టమాట ఎకరాకు రూ.1,600 ప్రీమియం చెల్లించాలని సూచించారు. ఇన్సూరెన్స్ చేసుకున్న రైతులకు పంట నష్టం వాటిల్లితే వేరుశనగ ఎకరాకు రూ.30 వేలు, వరికి రూ.42 వేలు బీమా నగదు అందుతుందని వివరించారు. పూర్తి సమాచారం కోసం వ్యవసాయశాఖ కార్యాలయం, రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

వాహనాల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న ఏఎస్ఐ రవి

పాలసముద్రం: చిత్తూరు–బలిజకండ్రిగ రహదారిపై పోలీసులు సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఏఎస్ఐ రవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే వాహన రికార్డులు సక్రమంగా ఉండాలని, డ్రైవింగ్ చేసేవారికి లైసెన్స్ లేకుంటే జరిమానా తప్పదని హెచ్చరించారు.

పంచాయతీ కార్యదర్శుల కమిటీ ఎన్నిక



కిరణ్‌కుమార్



దుర్గాప్రసాద్

గంగాధరనెల్లూరు: మండలంలోని పంచాయతీ కార్యదర్శుల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో గ్రేడ్–1, గ్రేడ్–2 పంచాయతీ కార్యదర్శు కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి పరిశీలకుడిగా వ్యవహరించారు. ఈ క్రమంలో కమిటీ అధ్యక్షుడిగా ముకళత్తూరు కార్యదర్శి కిరణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా (నెల్లెపల్లి)సుబ్బారెడ్డి, (పాత గుంట) కుమార్, ప్రధాన కార్యదర్శిగా వేల్కూరు కార్యదర్శి దుర్గాప్రసాద్, కోశాధికారి బాలగంగానపల్లె కార్యదర్శి శివయ్య, ఈసీ మెంబర్లుగా వై. కుమార్, పి.అమల, పీఎం చంద్ర, ఎం .ఝాన్సీ, ఏ.నిర్మల, జి.శ్రీనాథ్, జి.యుగంధర్ ఎన్నికయ్యారు.

కలుపు మొక్కలే శత్రువు

- యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి
- రబీకి సిద్ధమవుతున్న రైతులు
- రబీలో 283 హెక్టార్లలో వేరుశనగ సాగు

దేశంలో అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్న వాణిజ్య నూనె గింజల పంటల్లో వేరుశనగ ముఖ్యమైంది. వేరుశనగ సాగులో యాజమాన్య పద్ధతి పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చునని ఏఓ రజనికుమారి తెలిపారు. ఇప్పటికే మండలంలో వర్షాలు కురవడంతో చాలా మంది రైతులు వేరుశనగ సాగు చేపట్టారు. మరి కొంత మంది విత్తనం సిద్ధం చేస్తున్నారు. అయితే కలుపు ఎక్కువగా ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేరుశనగ సాగుకు ముందు యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చు.



వేరుశనగలో కలుపు తీస్తున్న కూలీలు

విజయపురం: మండలంలోని రైతులు వేరుశనగ సాగుపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది ప్రభుత్వ వేరుశనగ విత్తనం ఆలస్యంగా పంపిణీ చేయడంతో రైతులు ప్రైవేటుగా విత్తనం కొనుగోలు చేసి సాగుకు సిద్ధమవుతున్నారు. మరి కొందరు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది రబీలో 283 హెక్టార్లలో వేరుశనగ సాగు కానున్నట్లు అధికారులు తెలిపారు. యాజమాన్య పద్ధతులు పాటించకపోవడంతో ప్రతి ఏటా రైతులు నష్టపోతున్నారని, వేరుశనగలో ఎరువు యాజమాన్యం, సస్యరక్షణ పాటిస్తే మంచి దిగుబడితోపాటు, ఖర్చు తగ్గుతుందని అధికారులు సూచించారు.

అధిక మోతాదు వద్దు

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి. అధిక మోతాదులో ఎరువులు వాడితే కలుపు ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా ఆఖరి దుక్కిలో ఎకరానికి 4 –5 టన్నుల బాగా కుళ్లిన పశువుల ఎరువు, 100 కిలోల సూపర్‌పాస్ఫేట్, 200 కిలోల యూరియా, 35 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి. పూత దశలో లేదా కలుపు తీసే ముందు ఎకరానికి 200 కిలోల జిప్సం వేసుకుంటే నాణ్యమైన గింజలు వస్తాయి.

కలుపు నివారణ

కలుపు సమస్య తీవ్రంగా ఉన్న భూముల్లో వేరుశనగ విత్తిన 48 గంటల్లోపు ఒక ఎకరాకు 200 లీటర్ల నీటికి 1 లీటరు పెండిమిథాలిన్ కలిపి నేలపై పిచికారీ చేస్తే 25 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవచ్చు. విత్తిన 25 రోజుల తర్వాత వెడల్పు ఆకులు గల కలుపు మొక్కలు ఉన్నట్లయితే ఎకరాకు ఇమాజితాఫిర్ 10% లేదా ఇమాజీమాక్స్ 35% కలుపు మందును 40 గ్రా. ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి మొక్కలపై పిచికారీ చేసి అన్ని కలుపు మొక్కలను నివారించవచ్చు. సాధ్యమైనంత వరకు కలుపు మొక్కలను కూలీల ద్వారా తొలగించడం మంచిది.

దిగుబడి తగ్గుతుంది

వేరుశనగలో కలుపు మొక్కలు ఉంటే పంట ఎదుగుదల తగ్గుతుంది. దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుంది. కలుపు నివారణ పద్ధతులను తెలుసుకోకపోవడంతోనే రైతులకు పెట్టుబడి తడిసి మోపెడవుతోంది. రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. కలుపు మందులు వినియోగించి సరైన యజమాన్య పద్ధతులు పాటిస్తే పంట లాభసాటిగా ఉంటుంది.

– రజనికుమారి, ఏఓ, విజయపురం

ప్రభుత్వ భూములను పరిరక్షించండి



ఆర్డీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న మురగారెడ్డి బృందం

పుత్తూరు: మండల పరిధిలోని ప్రభుత్వ భూములను ఎకరాలకు ఎకరాలు కబ్జా చేసి బహిరంగంగా విక్రయిస్తున్నారని, ఈ అక్రమాలను అరికట్టాలని స్థానిక సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి బృందం సోమవారం తిరుపతి ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పుత్తూరు మండలం, తడుకు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 6/4, 6/5 లోని ప్రభుత్వ అసైన్డ్ భూములను అమ్మేస్తున్నారని ఆరోపించారు. గోవిందపాళెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 282/4లో, పరమేశ్వరమంగళం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 231/2 నుంచి 6 వరకు గల భూములు కబ్జాకు గురయ్యాయని తెలిపారు. నందిమంగళం సర్వే నెంబర్ 76/1లో నగరి మండలానికి చెందిన ఒకే కుటుంబానికి 3 పట్టాలు ఇచ్చారన్నారు. ఈ అక్రమాలను అరికట్టాలని కోరారు.

అప్పలాయగుంటలో ఆధార్ కేంద్రం

వడమాలపేట(విజయపురం): వడమాలపేట మండలం, పత్తిపుత్తూరు, అప్పలాయగుంటలో ప్రజల సౌకర్యార్థం ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శేషగిరిరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26, 27వ తేదీ పత్తిపుత్తూరు, 28, 29 అప్పలాయగుంట పంచాయతీ భవనంలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. స్థానిక ప్రజలు, చుట్టు పక్కల గ్రామస్తులు ఆధార్ కేంద్రానికి వెళ్లి సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం





పుత్తూరు రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు, వెదురుకుప్పం: పూజలు చేస్తున్న భక్తులు

పుత్తూరు: పట్టణం సోమవారం ఆధ్మాత్మిక శోభ సంతరించుకుంది. కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. స్థానిక శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయంలో ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపారాధన చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రాస్ ఆధ్వర్యంలో..

రాష్ట్రీయ సేవా సమితి(రాస్) మహిళా పొదుపు సంఘాల సభ్యులు సోమవారం ఆరేటమ్మకాలనీలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తిక దీపారాధన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాస్ అధికారి రవి మాట్లాడుతూ కార్తీక మాస విశిష్టత, దీపారాధన ప్రాముఖ్యతను తెలియజేశారు. మహిళా సంఘ సభ్యులు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ వద్ద అరుణగిరిపై వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో కార్తీక సోమవారం పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా కొండమల్లీశునికి పాలు, పెరుగు, కుంకుమ, విబూది, నారికేళీ జలాలతో అభిషేకాలు చేశారు. ఈ క్రమంలోనే ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు జరిపించారు. మహిళలు భక్తి శ్రద్ధలతో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. తిరుపతి అలిపిరి ఆర్టీసీ డిపో మేనేజర్ హరిబాబు, సిబ్బందితో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త కృష్ణారెడ్డి , కమిటీ సభ్యుడు రమేష్ పాల్గొన్నారు. అలాగే చవటగుంటలోని ఆవుదేవర నందీశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేక పూజలు చేపట్టారు.

బాలగునాధీశ్వరాలయంలో..

పాలసముద్రం : మండలంలోని రాచపాళ్యంలో వెలసిన బాలగురుసాధీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పిండి దీపాలను ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు.

సారా స్థావరాలపై విస్తృత దాడులు



నిందితుడిని అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

కార్వేటినగరం: అసిస్టెంట్ కమిషనర్, ప్రొహిబిషన్, ఎక్సైజ్ వారి ఆదేశాల మేరకు వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల్లో విస్తృత దాడులు చేశామని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శిరీషాదేవి తెలిపారు. సోమవారం ఎక్సైజ్ కార్యాలయం ముందు అక్రమ సారా కలిగిన వ్యక్తిని అరెస్టు చూపించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఏఈఎస్, ఈఎస్టీఫ్ సీఐ మోహన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ పవన్‌కుమార్ వారి సిబ్బందితో వెదురుకుప్పం మండలం నక్కలాంపాళెం, యనమల మంద గ్రామాల్లో దాడులు చేసి, 1400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. అలాగే కార్వేటినగరం మండలంలోని రాజులకండ్రిగ గ్రామానికి చెందిన ఎల్లయ్య కుమారుడు గంగాధర్ అక్రమంగా సారా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు చేసి, మూడు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

రక్తహీనత నివారణకు జాగ్రత్తలు

తవణంపల్లె: గర్భిణులు రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని మాధవరంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ కేశవనారాయణ రోగులకు వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భిణులు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వృద్ధులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని సూచించారు. చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నృసింహునికి విశేష పూజలు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. వేకువజామునే సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తి ప్రపత్తులతో స్వామి వారికి క్షీరాభిషేకం చేశారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

ప్రత్యేక అలంకరణలో స్వామి వారు





పూజలో పాల్గొన్న భక్తులు

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

శ్రీరంగరాజపురం: ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ లోకనాథ పిళ్లై ఆదేశించారు. సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 17 వినతులు వచ్చినట్లు వెల్లడించారు. ఆయా అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులకు అప్పగించినట్లు వివరించారు. త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు.

దరఖాస్తుల గడువు పెంపు

పుత్తూరు: ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ ఐటీ హెల్ప్‌డెస్క్ అటెండెంట్ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తుల గడువును ఈ నెల 28 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపల్ బి.చంద్రమౌళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో ఈనెల 28వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఏదేని డిగ్రీ చేసిన యువతీయువకులు అర్హులని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ కార్డు, మార్కుల లిస్ట్ జెరాక్సులతోపాటు ఫొటో తీసుకురావాలని తెలిపారు. శిక్షణ పొందిన వారికి స్కిల్ ఇండియా సర్టిఫికెట్ ఇవ్వడంతోపాటు ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. వివరాలకు 63009 54441 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ముమ్మరంగా పొలం పనులు

పాలసముద్రం: మండలంలోని మహిళలు పొలం పనుల్లో బిజీ బిజీగా ఉన్నారు. ప్రభుత్వం అన్నదాతా సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందించకపోయినా, రైతులు అప్పు చేసి మరీ చెరుకు, వరి, వేరుశనగ సాగు చేపట్టారు. ఈ క్రమంలో కలుపుతీత పనుల్లో మహిళలు నిమగ్నమయ్యారు. ఉపాధి పథకం కింద కూలి పనులకు పెద్దసంఖ్యలో తరలివెళుతున్నారు.

బైక్ దొంగ అరెస్టు



నిందితుడు సురేష్

తిరుత్తణి: తిరుత్తణి డీఎస్పీ కార్యాలయం ప్రాంతంలో, రైల్వే స్టేషన్ సమీపంలో ఓ ఇంటి వద్ద వుంచిన బైకు, దుకాణం గోడకు కన్నం వేసి రూ. 24 వేలు చోరీ ఘటనపై తిరుత్తణి పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించి ఆంధ్రాకు వెళ్లారు. చిత్తూరు జిల్లా పుత్తూరుకు చెందిన సురేష్ (32) ఆనే యువకుడిని ఆదివారం అదుపులోకి తీసుకుని అతని నుంచి బైకు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీసులు అరెస్టు చేశారు.

జాబ్ మేళాలో 29 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన అభ్యర్థులతో ప్రిన్సిపల్

కార్వేటినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాలో 29 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎస్.విజయులురెడ్డి తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, డీఆర్‌డీఏ, కళాశాల జేకేసీ ఆధ్వర్యంలో మేళా నిర్వహించినట్లు వెల్లడించారు. ఫ్లిప్‌కార్ట్, యాక్సిస్ బ్యాంకు, తిరుపతి హోంకేర్ సర్వీస్, టాటా క్యాపిటల్ లిమిటెడ్ కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులు మొత్తం 63 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌ఓసీ జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి చైతన్య, స్కిల్‌హబ్ కో–ఆర్డినేటర్ అబ్దుల్‌అజీజ్, జేకేసీ కో–ఆర్డినేటర్ సీఎస్ లత, జేకేసీ మెంటర్ టి.లోకేశ్వర్, అధ్యాపకులు ధనుంజయరెడ్డి, సుబ్బారావు, హరిబాబు, రఘురాం, కార్తీక్, భార్గవి, మీనా, అన్బళగన్ పాల్గొన్నారు.

ప్రయాణం నరకప్రాయం



వర్షానికి దెబ్బతిన్న రోడ్డు

విజయపురం: గ్రామీణ ప్రాంత రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రజలు నరకం చూస్తున్నారు. ప్రధానంగా ఆర్‌అండ్‌బీ రోడ్లు శిథిలమవ్వడంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. రహదారులు ధ్వంసమై గోతులమయం కావడంతో చినుకుపడితే చెరువులను తలపిస్తున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారుల అభివృద్ధి ఎక్కడా జరగలేదు. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్లపై గుంతలు ఏర్పడడంతో వాహన చోదకులు ప్రయాణాల్లో చుక్కలు చూస్తున్నారు. బుగ్గఅగ్రహారం మీదుగా కాళికాపురం, గంగమాంబపురం, మంగళకండ్రిగ, ముత్యాలరెడ్డికండ్రిగ, మంగళ చెరువు మీదుగా వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు గోతులమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్ల మీదుగా ప్రయాణం సాగించాలంటే వారు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. వర్షానికి దెబ్బతిన్న రోడ్డును అధికారులు ఇంత వరకు పట్టించుకోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్డును సరి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తరుముకొస్తున్న ప్లాస్టిక్ భూతం

- విచ్చలవిడిగా పాలిథిన్ కవర్ల అమ్మకం
- పాలిథిన్ వినియోగంతో అనర్థాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



వడమాలపేట: ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన చెత్తకుండీ

వడమాలపేట(విజయపురం): మానవుని జీవితంలో ప్లాస్టిక్, పాలిథిన్ క్యారీ బ్యాగుల వాడకం నిత్య కృత్యంగా మారింది. ఫలితంగా వాతావరణం కాలుష్యంతో వివిధ రకాల వ్యాధులకు ప్రజలు గురవుతున్నారు. ప్రభుత్వం పలు రకాల వస్తువులను వినియోగించకూడదంటూ నిషేధిత ప్రకటనలు చేసి చట్టాలు తీసుకొచ్చినా అధికారుల లోపంతో అవి అమలుకావడం లేదు. దీనికి ఉదాహరణగా ప్రజలు విచ్చలవిడిగా వాడుతున్న పాలిథిన్ కవర్లు అని చెప్పుకోవచ్చు. ప్లాస్టిక్, పాలిథిన్ క్యారీ కవర్లు వాడడంతో మన ఆరోగ్యాన్ని మన చేతులారా పాడు చేసుకుంటున్నాం. రోడ్డు పక్కన అమ్మే పానీపూరి నుంచి పెద్ద హోటల్ వరకు ఏ వస్తువును ఇంటికి తీసుకుపోవాలన్నా క్యారీ బ్యాగులనే ఆశ్రయిస్తున్నారు. ప్రధానంగా మున్సిపల్, పట్టణాలలో నేటికీ ప్రతి షాపుల్లో, చిన్న చిన్న వ్యాపారులు బండ్లపై యథేచ్ఛగా పాలిథిన్ క్యారీ బ్యాగులను వినియోగిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. వీటి వాడకంతో పర్యావరణంతోపాటు ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని తెలిసినప్పటికీ ప్రతి ఒక్కరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. అధికారులతోపాటు ప్రజలు పాలిథిన్ కవర్ల వాడకంపై ఆలోచించాల్సిన ఆవశ్యకత ఉందని కొందరు వైద్యులు, నిపుణులు తెలిపారు.

క్యాన్సర్ వ్యాధి సోకే ప్రమాదం

పాలిథిన్ క్యారీ బ్యాగుల్లో క్యాన్సర్ కారక రసాయన పదార్థ కార్సినోజెన్స్ ఉంటుంది. ఈ పదార్థం మనం తీసుకెళ్లే వస్తువుల్లో చేరిపోతుంది. ఆ ఆహారం పదార్థాలు తినడంతో ఎంతో కొంత మన శరీరంలో క్యాన్సర్ కణాలు తయారవుతాయని వైద్యులు చెబుతున్నారు. ఇరవై మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉండే వాటిని వినియోగిస్తే క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువని వైద్యాధికారులు తేల్చి చెబుతున్నారు. అంతేకాకుండా ప్రజల ఆరోగ్యంతోపాటు ప్రకృతిలోని గాలి, నీరు, మట్టి వంటివాటికి ఈ పాలిథిన్ కవర్లతో తీవ్ర ముప్పు ఏర్పడుతుంది. ప్రజలు వాడి పడవేసిన క్యారీ సంచుల నుంచి ప్రమాదకరమైన డయాక్సిన్ విడుదలై శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యర్థాలు ఎక్కువ కాలం అలాగే ఉండడంతో ప్రజలకు పలు రకాలు జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది.

ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలి

పాలిథిన్ కవర్ల వినియోగంతో కలిగే అనర్థాలపై విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం అధికారులపై ఎంతైనా ఉంది. అయితే ఇది పట్టణ, మండల, గ్రామస్థాయిలో ఎక్కడా అమలుకావడం లేదు. పాలిథిన్ క్యారీ బ్యాగుల్లో తీసుకెళ్లే వస్తువులు, ఆహార పదార్థాలు తినడంతో కలిగే ఆరోగ్యం, పర్యావరణ పరమైన నష్టాలపై కరపత్రాలు ముద్రించి ప్రచారం చేయడం లేదని కొందరు విమర్శిస్తున్నారు. వీటి నియంత్రణకు అధికారులు క్షేత్రస్థాయిలో పని చేయడం లేదన్న వాదన కూడా వినిపిస్తోంది.

ఆరోగ్య సమస్యలు వస్తాయి

పాలిథిన్ క్యారీ బ్యాగుల వాడకంతో ప్రమాదం ఉంది. వాటిలోని ప్రమాదకరమైన రసాయనాల కారణంగా ప్రజలకు ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇందులోని కార్సినోజెన్స్ రసాయనం కారణంగా క్యాన్సర్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. వీటి వినియోగంపై ప్రజలు వారికి వారే చైతన్యం కావాలి. క్యారీ కవర్ల వాడకం తగ్గించాలి.

– సోమశేఖర్, వైద్యాధికారి, విజయపురం